ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శుక్రవారం | 22 నవంబర్ 2024 | ■ 9 పేజీలు

ప్రజా ఆరోగ్యం-ప్రమాణాలతో కూడిన..

# విద్య ప్రభుత్వ బాధ్యత

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



ఉత్తర తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో రూ.300 కోట్ల నిధులతో మంజూరైన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి శంకుస్థాపన చేశారు.

# హైడ్రా అటెన్షన్




- ■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువుల కబ్జాలకు చెక్
- ■ హైడ్రా తరహా జిల్లా కేంద్రాల్లోనూ ఉక్కు పాదం మోపాలి
- ■ గత ప్రభుత్వ పాలనలో చెరువులు, భూముల కబ్జా ■ చెరువుల కబ్జాలో నిర్మల్ టాప్
- ■ మంచిర్యాల జిల్లాలోనూ చెరువులు కబ్జా చేసి లే అవుట్‌ల ఏర్పాటు చేసిన వైనం..
- ■ హైడ్రా ప్రకంపనలతో అందరి దృష్టి నిర్మల్‌పైనే ■ చెరువుల ఆక్రమణదారుల్లో టెన్షన్
- ■ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు ■ సహకరించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- ■ సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో మొదలైన చర్చ ■ స్థానికుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

ఆపరేషన్ హైడ్రా..!.. ఇప్పుడు ప్రతి ఒక్కరి నోట్లో నానుతున్న మాట. హైదరాబాద్ జంట నగరాల్లో చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న అనేక భవనాల సముదాయాలను కూల్చివేస్తున్న పరిణామాలపై అంతటా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ చెరువుల హద్దుల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే చెరువుల హద్దులను గుర్తించిన అధికారులు కొందరికి నోటీసులు కూడా జారీ చేసినట్లుగా సమాచారం. ముఖ్యంగా నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా కేంద్రాలతో పాటు పలు మున్సిపాలిటీలలో చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి ఆక్రమణదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. కోర్టు కేసులు నడుస్తున్న నేపథ్యంలో నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు ఆక్రమణకు గురైన స్థలాలు, వాటి పూర్తి వివరాలను కోర్టులకు సమర్పించారు.

- ప్రభాత సమాచారం ప్రత్యేక ప్రతినిధి

6

## అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

- ■ విజయోత్సవ సంబురాల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరించిన కళాకారులు
- ■ నిర్మల్ జిల్లాలో ప్రజాపాలన సంబురాలు..
- ■ హాజరైన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- ■ ధూం..ధాంగా సాగిన కళా ప్రదర్శనలు



ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ సమర్థవంతంగా పథకాలను అమలు చేస్తోందని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు నిర్మల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు.

టెన్త్ విద్యార్థులకు

## ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
పది, ఇంటర్ పరీక్షలపై సమీక్ష
వంద శాతం ఫలితాలు సాధించాలి

రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ

## విధులు నిర్వహించాలి

- ■ శిక్షణను పూర్తి చేసుకున్న 254 మంది ఎస్సీటీపీసి సివిల్ కానిస్టేబుళ్ళు
- ■ అధికారులు, కుటుంబసభ్యుల సమక్షంలో దీక్షాంత్ పరేడ్ ■ పోలీసు సేవలో ప్రతి ఒక్కరూ అంతర్భాగమే
- ■ చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులను నిర్వర్తించాలి
- ■ పోలీసు వ్యవస్థలో కుటుంబసభ్యుల సహకారం తప్పనిసరి ■ కలెక్టర్, ఎస్పీ, బెటాలియన్ కమాండెంట్
- ■ ఆరు జిల్లాల నుంచి పాల్గొన్న కానిస్టేబుల్ కుటుంబసభ్యులు ■ ఆనందంలో కానిస్టేబుళ్ల తల్లిదండ్రులు..



నీతి నిజాయితీలతో పాటు రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ పోలీసులు విధులు నిర్వహించాలని పీఅండ్ఎల్ ఐజీ రమేష్ అన్నారు. ఉద్యోగ రీత్య ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. గురువారం స్థానిక పోలీసు శిక్షణ కేంద్రంలో 9 నెలలపాటు నిరంతరంగా కఠోర శ్రమతో కూడిన శిక్షణను పూర్తి చేసుకున్న 6 జిల్లాల 254 స్టైఫండరి ట్రైనీ సివిల్ కానిస్టేబుళ్లు పరేడ్ నిర్వహించారు. ఐజీ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ ప్రతి ఒక్కరూ విధులను నిర్వర్తించాలని సూచించారు. తాను కూడా ఒకప్పటి ఆదిలాబాద్ జిల్లాలో శిక్షణను తీసుకున్నట్లు గుర్తు చేశారు. పోలీసు ఉద్యోగంలో క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమైన విషయమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

## ఆదివాసీల అభివృద్ధే లక్ష్యం

9

పీఎం జన్ మన్ పథకంతో ఆదివాసీల అభివృద్ధి
ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్
జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం



దేశ వ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరి జనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్ మన్ యోజన) పథకం ప్రవేశ పెట్టిందన్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తామని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం మారుమూల గ్రామాలైన పాతూగూడ, మొలలగుట్టలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఆ బహుమతులు.. మాకొద్దు 5

# తెరపైకి మళ్లీ 'పల్లెపోరు'



**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల పై మరోమారు దృష్టి సారిస్తుంది. వార్డుల విభజన, ఓటర్ల జాబితా సవరణ, నూతన ఓటరు నమోదు ప్రక్రియ, ఎన్నికలకు కావలసిన అన్ని రకాల చర్యల్లో దృష్టి పెడుతుంది. దీంతో పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కనబడుతుంది. ఎక్కడ చూసినా ఈసారి ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన పై సర్వే చేస్తుండటంతో త్వరలోనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తుందని ఆశావాహులు ఇప్పటి నుండే సిద్ధపడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పెంచితే బీసీలకు మరింత లాభం చేకూరనుంది. సర్వే పూర్తయి కంప్యూటర్‌లో నమోదు చేసి కులాల వారిగా గణన చేసేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుండే గ్రామాల్లో రాజకీయ నాయకులు ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులంతా ఇప్పటి నుండే గ్రామస్థాయిలో ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఇప్పటికే మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఆమలులో ఉండడంతో రిజర్వేషన్ పురుషుడికి వచ్చిన, మహిళలకు వచ్చిన, ఏ రిజర్వేషన్ వచ్చిన ఎవరిని పోటీలో ఉంచాలనే దాని పై ఇప్పటికే పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను గ్రామస్థాయిలో మీ ప్రచారాన్ని మొదలుపెట్టి ప్రజలతో సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నట్లు సమాచారం. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుండి ఎక్కువ మంది పోటీ చేయాలని ఆశావహులంతా అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతూ పోటికై ఎదురు చూస్తున్నారు. "ఒకే ఒరలో రెండు కత్తులు ఉండవు అన్నట్లు"గానే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో అధికారమే లక్ష్యంగా పార్టీలో పలు పార్టీలకు చెందిన నేతలను చేర్చుకొని ఇప్పుడు ఎవరికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుచరుడిగా మద్దతు ఇవ్వాలనే దాని పై నాయకులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ముగ్గురు పిల్లలు ఉన్నా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తానని హామీ ఇవ్వడంతో మరింత ఆశావహుల సంఖ్య పెరగనుంది. ఈసారి స్థానిక ఎన్నికల్లో నేను లేదా నా సతీమణిని పోటీ చేయించి గెలుపొందాలని రిజర్వేషన్ ఆడ, మగ వచ్చిన పోటీ చేయాలనే ఉత్సాహంతో ఇప్పటికే గ్రామస్థాయిలో ప్రచారాన్ని సైతం సిద్ధం చేసుకున్నారు. ఏది ఏమైనా ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం పూర్తయి 10 నెలలు గడుస్తున్న గ్రామాల్లో పాలన వ్యవస్థ లేదు. పల్లెల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎవరు లేకపోవడంతో మండల, గ్రామ స్థాయి పరిపాలన వ్యవస్థ నిర్లక్ష్యంగా మారింది. స్థానిక సంస్థలలో ఉండే వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కో ఆప్టెడ్ సభ్యుల వంటి ప్రజాప్రతినిధుల పదవి కాలం ముగిసిపోవడంతో మండల గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పట్టించుకునే నాథులే కరువయ్యారు. మండల స్థాయిలో 3 నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో సమావేశాలు నిర్వహణ సైతం మరుగున పడింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సర్వేను సకాలంలో పూర్తిచేసి కులగణన లెక్కల ప్రకారమే రిజర్వేషన్లను ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

### మండల స్థాయి చెకుముకి
# సైన్స్ ప్రతిభా పరీక్ష



**బోథ్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
జన విజ్ఞాన వేదిక, ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోటీ పరీక్షను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ హాజరయ్యారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవి, ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదివే 8,9,10 పదవ తరగతి విద్యార్థులు ఈ పరీక్షను రాశారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ చిన్నతనం నుండే సైన్స్ పట్ల శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాలను నమ్మవద్దని, వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వాహకులు బైరి సతీష్ కుమార్ మాట్లాడుతూ పిల్లల్లో చిన్నతనం నుంచే సైన్స్ పట్ల శాస్త్రీయ దృక్పథాన్ని అలవరించేందుకు, సైన్స్ పట్ల అవగాహన పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు 28న ప్రభుత్వ డైట్ కళాశాల, ఆదిలాబాద్‌లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు.

# పొరపాట్లకు తావులేకుండా సమాచారం ఎంట్రీ చేయాలి




### డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష సమావేశంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వేలో భాగంగా 8 డాటా ఎంట్రీ ఆపరేటర్లకు హైదరాబాద్‌లో 16వ తేదీన మాస్టర్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని, దానికనుగుణంగా మండలంలోని 10 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు, మున్సిపాలిటీ లోని 20 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు డాటా ఎంట్రీ ట్రేనింగ్ ఇవ్వడం జరిగిందని, ఇందులో భాగంగా ప్రతి మండలంలో రేపు ఉదయం మిగతా డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ట్రైనింగ్ ఇస్తూ మధ్యాహ్నం నుండి డాటా ఎంట్రీ మొదలు పెట్టాలని, గడువులోగా పూర్తి సమాచారం పొరపాట్లకు తావు లేకుండా ఎంట్రీ చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం జడ్పీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, సీఈఓ, డిఆర్డిఓ, ఈడిఎస్‌సి కార్పొరేషన్, స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

### జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్

**నిర్మల్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న అన్ని పథకాలపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ తెలిపారు. గురువారం పెంబి మండల కేంద్రంలోని మ్యాక్స్ లో ఏడీసీసీ బ్యాంకు వారి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు పలు రకాల రుణ, బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు అన్ని రకాల పథకాలు రుణాలు, బీమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జన సురక్ష, పీఎం విశ్వకర్మ, ముద్ర, పీఎంఈజీపి, పీఎం జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, పిఎం ఎఫ్ఎంఈ, ఇతర వ్యవసాయ రుణాలపై రైతులకు, ప్రజలకు అవగహన కల్పించారు. రుణాలు పొంది వాటిని సక్రమంగా వినియోగించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అర్హులైన వారు రుణాలు



పొంది వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలైన డెయిరీ, కోళ్ళు, చేపలు, తేనెటీగలు పెంపకం వంటి రంగాలలో, కుటీర పరిశ్రమ, వ్యాపార, కుల వృత్తులలో అభివృద్ధిని సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహా రెడ్డి, తహసిల్దార్ లక్ష్మణ్ ఎంపీడీవో రమాకాంత్, ఏడిసిసి బ్యాంకు ఖానాపూర్ శాఖ మేనేజర్ కల్పన, ఎఫ్ఎల్ సి మచిందర్ రెడ్డి, సిఎఫ్ఎల్ జాదవ్, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువకులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



### దివ్యాంగులకు ఇచ్చిన
# హామీలను అమలు చేయాలి
### కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ఎన్నికల ముందు దివ్యాంగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని దివ్యాంగుల ఆత్మీయ సమితి జిల్లా అధ్యక్షుడు చందావార్ రాకేష్ అన్నారు. దివ్యాంగులకు ఆరు వేల పింఛన్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమను ఆదుకోవాలని నినాదాలు చేస్తు హోరెత్తించారు. అధికారంలోకి రాక ముందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఆరు వేల పింఛన్‌ను ఇస్తామని హామీ ఇచ్చారని దివ్యాంగుల ఆత్మీయ సమితి అధ్యక్షుడు రాకేష్ తెలిపారు. అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడుస్తున్న ఇప్పటి వరకు అందించలేదన్నారు. బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉపాధి కోసం షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సతీష్, అబ్దుల్ సలీం, ప్రమోద్, రాజశేఖర్, రవి, నందు పాల్గొన్నారు.

# సీఈఐఆర్ ద్వారా ఫోన్ అందజేత



**కాగజ్‌నగర్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన సదశివ తన మొబైల్ పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా పోలీసులు నమోదు చేశారు. దీంతో కాగజ్‌నగర్ టౌన్ సీఐ పీ. రాజేంద్రప్రసాద్ అట్టి మొబైల్ ఫోన్ ను సీఈఐఆర్ పోర్టల్ ద్వార ట్రేస్ చేసీ గురువారం బాధితునికి అప్పగించడం జరిగింది. సీఐ మాట్లాడుతూ ఎవరైనా సెల్ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ సీఈఐఆర్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

# మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం భేష్ : ఎంపీ నగేష్

**బోథ్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
మారుమూల వెనుకబడిన మండలమైన బోథ్ మండల ప్రజలకు వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో భార్యాభర్తలు ఇరువురు ఆసుపత్రిని నెలకొల్పడం గొప్ప విషయమని ఎంపీ నాగేష్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ చైత్రఆస్పత్రిని ఎంపీ నగేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రిలో లక్షలు సంపాదించే అవకాశం ఉన్నప్పటికీ సొంత మండల ప్రజలకు వైద్య సేవలు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని డాక్టర్‌గౌతమ్ దంపతులను అభినందించారు. పిఏసిఎస్ చైర్మన్ ప్రశాంత్,వెంకటేష్,పాల్గొన్నారు.



# రోగులకు 90శాతం చికిత్స మండల కేంద్రాల్లోనే జరగాలి

**మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు**
**సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం**
**ప్రజా ఆరోగ్యం-ప్రమాణాలతో కూడిన విద్య ప్రభుత్వ బాధ్యత**
**వైద్య, ఆరోగ్య,కుటుంబసంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**






**మంచిర్యాల, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ఉత్తర తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తాలో 300 కోట్ల రూపాయల నిధులతో మంజూరైన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి రాష్ట్ర ఐ.టి., పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టి.జి.ఎం.ఎస్.ఐ.డి.సి. ఎం.డి. హేమంత్ బొర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, మంచిర్యాల ప్రేమసాగర్ రావు, తెలంగాణ మినిమమ్ వేజెస్ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.డి. సులేమాన్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రాంతంలో మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని, ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు మంచి ఆలోచన అని, పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు, ప్రమాణాలతో కూడిన విద్య అందించడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటుందని తెలిపారు. వైద్య సేవల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా 90 శాతం వైద్యం ఇదే ప్రాంతంలో ఉచితంగా అందించి ప్రజలలో భద్రత, నమ్మకం కలిగిస్తామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 6 పడకలను 30 పడకలకు అప్ గ్రేడ్ చేయడంతో పాటు మరిన్ని ఉప కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 7 వేలకు పైగా వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని, సుమారు 54 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అత్యవసర సేవల సమయంలో వేగవంతమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అంబులెన్స్ సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, గిరిజన ప్రాంతాలలో 2, మండలానికి 1 చొప్పున అందించేందుకు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ప్రతి 30-35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర వ్యాప్తంగా 74 ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రజలు ప్రాణాపాయానికి గురి కాకుండా బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో అంబులెన్సు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని కిడ్నీ డయాలసిస్ కేంద్రంలో 10 పడకలను 30 పడకలకు పెంచడంతో పాటు డయాబెటిక్ వ్యాధిగ్రస్తుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలో అదనంగా 29 ఉప కేంద్రాల ఏర్పాటుతో పాటు మంచిర్యాల నియోజకవర్గంలోని వెంకట్రావుపేట, చెన్నూర్ నియోజకవర్గంలోని అంగ్రాస్‌పల్లిలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉత్తర తెలంగాణలో 4 క్యాన్సర్ కేంద్రాలు, వస్కులర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది సంఖ్యను పెంచి ప్రజలకు వైద్య సేవలను సంపూర్ణంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహిళలను విద్యావంతులను చేసి సమాజంలో అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రజలు రాష్ట్ర అభివృద్ధిలో జవాబుదారీగా ఉండాలని, సిద్ధాంత పరంగా సమాజ అభివృద్ధిలో భవిష్యత్తు నిర్ణయాలను జాగ్రత్తగా తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ఐ.టి., పరిశ్రమల శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సంవత్సర కాలంలో అనేక రంగాలలో అభివృద్ధి సాధించిందని, ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీ నుండి డిసెంబర్7వ తేదీ వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా 7 నియోజకవర్గాలు, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఇతర రాష్ట్రాల నుండి వైద్య సేవల నిమిత్తం వచ్చే ప్రజలకు అందుబాటులో అన్ని సేవలను అందించడం జరుగుతుందని, ప్రజలకు భారం కాకుండా ఉచితంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతని ఇస్తుందని, ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అకుంఠిత దీక్షతో ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, మంచిర్యాలలో వరద ప్రభావిత ప్రాంతాలు ముంపుకు గురికాకుండా 262 కోట్ల రూపాయల వ్యయంతో కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, 40 కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అభివృద్ధి చేసి నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం క్రింద అంతర్గత రహదారులను నిర్మిస్తూ మండల, జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేయడం ద్వారా వేగవంతమైన అభివృద్ధికి బాటలు వేస్తున్నామని తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధికి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో



మొదటిసారిగా మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా ప్రజలకు మందులను అందుబాటులో ఉంచేందుకు డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 6 గ్యారంటీల అమలుకు ఆర్థిక క్రమశిక్షణతో చర్యలు చేపడుతున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, వసతి గృహ విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచడం జరిగిందని తెలిపారు. 2 లక్షల రూపాయల రుణమాఫీలో భాగంగా రైతులకు 3 విడతలలో రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ క్రింద అందించడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని, సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించామని, 800 మెగావాట్ల సామర్థ్యంతో 3 పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను సరిచేసి ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు.

మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దాదాపు 15 లక్షల మందికి ఉపయోగపడుతుందని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని వారికి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటు కొరకు ప్రభుత్వం 300 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, 225 పడకలతో మాత శిశు, 425 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి కలిపి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం కొరకు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఇక్కడే పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా జిల్లాతో పాటు పక్క రాష్ట్రాల నుండి వచ్చే ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయుల ప్రయోజనాలు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ రెండు కళ్ళుగా అనునిత్యం పోరాడే సంఘం టిఎస్ యూటీఎఫ్ అని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరగంటి అశోక్ అన్నారు. గురువారం పట్టణంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఆయన డిమాండ్ చేశారు. బేలా మండల నూతన కమిటీ ఎన్నిక పట్ట ణంలోని డైట్ కళాశాలలో టీఎస్యూటీఎఫ్ బేల మండల మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్స రానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సూర్య కుమార్, పరిశీలకులుగా వి అశోక్ వ్యవ హరించారు. బేల మండల నూతన అధ్యక్షులుగా సి.అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. నాందేవ్‌లను ఎన్నుకున్నారు.

## ఆస్పతిని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**బోథ్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
బోథ్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ చైత్ర ఆసుపత్రిని కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅ తిథిగా హాజరై ప్రారంభించారు. బోథ్ మండల ప్రజలకు నాన్యమైన వైద్యాన్ని అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా పిల్లల వైద్య నిపుణులు డా.గౌతమ్, స్త్రీ వైద్య నిపుణుల డా. రాజ్యలక్ష్మిలు ఈ ఆస్పత్రికి ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తులా శ్రీనివాస్, డాక్టర్ ప్రసాద్ డాక్టర్ కార్తీక్‌తో పాటు పలువురు డాక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని సంతకాల సేకరణ

**జన్నారం, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

బొగ్గు బ్లాక్లను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరుతూ సీపీఐ(ఎం) జన్నారం మండల నాయకులు ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గురువారం మండలం లోని ఫోన్కాల్ గ్రామంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండగొర్ల లింగన్న, కవ్వాల్లో ఆ పార్టీ మండల నాయకుడు అంబటి లక్ష్మణ్, కొత్తపేట గ్రామపంచాయతీలో నాయకులు దాసన్ల రాజన్న వేరువేరుగా ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. రాష్ట్రానికి ఆయువుపట్టుగా ఉన్న సింగరేణి సంస్థను కాపాడుతూ ఆ సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్చేశారు. తెలంగాణలో బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, వేలంపాట రద్దు చేయాలని, ప్రైవేటుకు అప్పగించవద్దని, ప్రైవేటుకు అప్పగిస్తే నిరుద్యోగ సమస్య పెరిగి,సింగరేణి ఆధారంగా అభివృద్ధి అయిన పట్టణాలన్నీ నష్టపోతాయన్నారు. వేల కోట్ల లాభాలు గడిస్తున్న సింగరేణి సంస్థ, ప్రతి సంవత్సరము కేంద్రానికి, రాష్ట్రానికి డివిడెంట్ రూపంలో ఫండ్ చెల్లిస్తుందన్నారు. ఎటువంటి పెట్టుబడి లేకుండానే ఆదాయం సమకూర్చుతున్న సంస్థను రక్షించుకోవలసిన బాధ్యత ప్రజలందరిదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

మార్చి 2025 వరకు పూర్తి చేయవలసిన పనుల ప్రణాళిక పై జిల్లా పాలనాధికారి రాజర్షి షా సంబంధిత అధికారులు, అన్ని మండలాల ఎంపిడిఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొలం బాట ద్వారా వ్యవసాయ క్షేత్రాలకు గ్రావెల్ రోడ్లు, జలనిధి ద్వారా చెక్ డ్యాములు, వ్యవసాయ చెరువులు, రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, బోర్ వెల్ రీచార్జ్ నిర్మాణాలు, నీటి పారుదల ఓపెన్ బావులు, గ్రామీణ పారిశుద్ధ్యం ద్వార సోక్ పిట్స్, వ్యక్తిగత పాఠశాల మరుగుదొడ్లు గర్ల్స్, గ్రామీణ మౌళిక సదుపాయాలు సీసీ రోడ్లు, అంగన్వాడి భవనాలు, భవనాలు నిర్మాణాల తీరు పై ఎంపిడిఓ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లో మండలానికి 3 చొప్పున అంగన్వాడీ భవనాలు మొత్తం 54 ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.



## పోస్టాఫీసు సేవలపై డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్



### విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేత

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

పోస్టఫీసు సేవలపై డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ ద్వారా అవగాహన కల్పించడంతో పాటు సర్టిఫికేట్లను అందిస్తున్నామని ఉమ్మడి జిల్లా తపాల పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్దార్థ అన్నారు. 45 రోజుల ఇంటర్న్షిప్ పూర్తి చేసుకున్నఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ముగ్గురు విద్యార్థులకు నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కలిసి గురువారం ధ్రువపత్రాలను అందజేశారు. అదనపు కలెక్టర్ ఇంటర్న్షిప్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐపీపీబీ తరపున డిజిటల్ లావాదేవిలను సులభతరం చేసేల వ్యాపారస్తుల కోసం డాక్ సేవా క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా తపాల పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్దార్థ మాట్లాడుతూ తపాల శాఖ తరపున డిగ్రీ ఫైనల్ ఈయర్ విద్యార్థులకు 45 రోజుల పాటు తపాలా సేవలపై అవగాహన కల్పించేల ఇంటర్న్షిప్ ఇస్తున్నామన్నారు. డిగ్రీ కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు శివాణీ, శరణ్య, ప్రవలికలు 45 రోజుల పాటు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఇక్కడి సేవల గురించి తెలుసుకున్నారని తెలిపారు. అదే విధంగా డిజిటల్ లావాదేవిల్లో పోస్టాఫీసు కూడా అడుగుపెట్టిందన్నారు. వ్యాపారుల కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. పోస్టాఫీసుకు ఎక్కువ మంది వినియోగదారులు గ్రామీణప్రాంతాల నుంచే ఉన్నారని, వారికి ఎంతో సులభతరం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ రాజేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అతిక్ బేగం, అధ్యాపకులు చంద్రకాంత్, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్యలపై కన్జర్వేటర్‌ను కలిసిన ఎమ్మెల్యే

**బెల్లంపల్లి, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని మండలంలో అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యలను పరిష్కరించి పట్టాలు జారీ అయ్యేలా చూడాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి ఆర్ఎం దోబ్రియాల్ ఐఎఫ్ఎస్సి అధికారిని కలిసి విన్నవించారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతుల గురించి వివరించడం జరిగింది. ఈసందర్భంగా స్పందించిన చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ దోబ్రియల్ మాట్లాడుతూ త్వరలోనే సంబంధిత అధి కారులతో చర్చించి సమస్యలు పరిష్కరి స్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నా రు. ఇట్టకేలకు పోడు భూముల సమస్యలకు పరిష్కారం దొరుకుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని మూడు భూములను సాగు చేసుకుంటున్న వారిలో ఆనందం వెల్లివిరుస్తున్నది.

## ఆరోగ్య పాఠశాల కార్యక్రమంపై కలెక్టర్ సమావేశం

### విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా చూడాలి- ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా






**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాతసమాచారం)**

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా నేతృత్వంలో నిర్వహిస్తున్న ఆరోగ్య పాఠశాల కార్యక్రమంపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ ఛాంపియన్స్ లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం 14 నవంబర్ నుండి కొనసాగుతుంది. కాగా వారం రోజుల లో ఈ కార్యక్రమంపై గల అభిప్రాయాలను ప్రతి మండలం నుండి ఒక పాఠశాల విద్యార్థి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి హాజరై వారు గత వారంలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలను వివరించారు. వాటి నుండి విద్యార్థులకు కలిగిన లాభాలు, పిల్లలలో కలిగిన మార్పులు అందరితో పంచుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పిల్లలు సొంతంగా పరిశుభ్రత అలవాట్లను అలవర్చుకోవడం మంచి శుభ పరిమణామన్నారు. ఈ కార్యక్రమాన్ని సహ పాఠ్యాంశాలలో భాగంగా చిరకాలం ఉండి పోయేలా చూడాలని, మరొక విద్యార్థి తెలియకుండానే ఒత్తిడికి గురై ఇప్పుడు తెలిసిన తర్వాత ఒత్తిడికి లోను కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవనం కొనసాగిస్తే ఒత్తిడికి లోను కామని అది ఇప్పుడు మాలో క్రమశిక్షణ పెంపొందించిందని చెప్పుకొచ్చారు. అలాగే పిల్లలలో తంబాకు అలవాటు ఎక్కువగా ఉండేది అది ఇప్పుడు చాలమట్టుకు తగ్గిందని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన, క్రమశిక్షణ సంతులిత ఆహారము ఉన్నత విలువలతో కూడిన జీవనం మొదలగు విషయాల వల్ల మార్పు కలిగింది మెరుగైన జీవనం కోరుకుంటున్నారని తెలిపారు. మరొక పాఠశాలలో విద్యార్థులు గుటుక తినే అలవాటును తాము తినము అని వారంతట వారు వచ్చి ప్రేయర్ లో ప్రతిజ్ఞ చేయడం జరిగిందనీ, ఇది వారిలో కలిగిన గొప్ప మార్పు అని కొనియాడారు. ఇలా ఆరోగ్య పాఠశాల కార్యక్రమలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 18 మండలాల నుండి ఒక్కొక్క మండలం నుండి ప్రధానోపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్ , మలేరియా అధికారి శ్రీధర్, డిడబ్ల్యూఓ సబిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### సైన్స్‌పై అవగాహన కల్పించేల

## పరీక్షల నిర్వహణ అభినందనీయం

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

మూఢనమ్మకాలను తొలగించడంతో పాటు సైన్స్‌పై అవగాహన కల్పించేల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ సోమయ్య అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ పరీక్షను లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులు పరీక్ష రాయగా వారికి సూచలను చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సోమయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్ గురించి తెలియడం కోసం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, విశ్వాసాలు పెరిగిపోయాయని తెలిపారు. వాటిని నిర్మించేందుకు జన విజ్ఞాన వేధిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గతంలో జైనథ్ పాఠశాలలో దెయ్యం ఉందనే అపోహలను తిప్పికొట్టేట్ల జేవీవీ నాయకులు అక్కడి రాత్రి నిద్రించి చూపించి భయాన్ని తొలగించారని గుర్తు చేశారు. విద్యార్థులు సైన్స్ గురించి తెలుసుకుంటు ఇతరులకు కూడా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేధిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఉశన్న, ప్రయివేట్ పాఠశాలల యాజమన్యాల సంఘం అధ్యక్షుడు రంగినేని పవన్ రావ్, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రన్సిపాల్ దేవేందర్ పటాస్కర్, జేవీవీ నాయకులు గంగన్న, లింగారెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు శశికాంత్, దయాకర్ రెడ్డి, గుండి మహేష్ పాల్గొన్నారు.



## గుడుంబా తయారు చేసినా, విక్రయించిన చర్యలు




**ఖానాపూర్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

అక్రమంగా గుడుంబా తయారు చేసి అమ్ముతున్న నలుగురు వ్యక్తులను గురువారం ఖానాపూర్ తహశీల్దార్ శివరాజ్ ముందు బైండోవర్ చేసినట్లు నిర్మల్ జిల్లా ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టణంతో పాటు పలు గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న నలుగురిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నూతన డిఇఓ తో 'మేవా ప్రతినిధుల భేటీ



**నిర్మల్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పి. రామారావును మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా), టీఎస్పీటిఎ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బోకేను అందించి శాలువతో సన్మానించారు. జిల్లాలో నెలకొన్న ఆయా ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలను డిఇఓ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎక్కడైతే ఉపాధ్యాయుల కొరత ఉందో తన దృష్టికి తెచ్చినట్టయితే వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా పూర్తి చేస్తా మని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేవా మరియు టిఎస్పిటిఎ అధ్యక్షులు షబ్బీర్ అలీ టిఎస్పిటిఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాజిద్ మేరాజ్, మేవా నాయకులు జెడ్హెచ్ మసూద్, సయ్యద్ సర్ఫరాజ్, సాజిద్ మొహి ఉద్దీన్, అయ్యు బ్ ఖాన్, జిల్లా పరీక్షల విభాగాధికారి సిద్ధ పద్మ, విద్యాశాఖ అధికారి కార్యాలయం పర్యవేక్షకులు రమణ, డిసిఇబి కార్యదర్శి భానుమూర్తి పాల్గొన్నారు.

## కౌలు రైతులకు భరోసా కల్పించాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

కౌలురైతులను గుర్తించి వారికి రైతు భరోసా నిధులు వచ్చే విధంగా అసెంబ్లీలో ప్రస్తా వించాలని రైతుస్వరాజ్యం వేదిక ఆధ్వర్యంలో ఎమ్మె ల్యేకు వినతిప్రతాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్య క్షుడు బొర్రన్న మాట్లా డుతూ ఉమ్మడి ఆదిలాబాద్జిల్లాలో 1.17లక్షల మంది కౌలురైతులు ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కౌలురైతులకు రైతుభరోసా ఇస్తా మని హామీ ఇచ్చిన్నప్పటికీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. దీంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కౌలు రైతుల సమస్యలను శీతాకాలఅసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మాణిక్రావు, దుందెరావు, యశ్వంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాటం



### జిల్లా అధ్యక్షులు కొవ విజయ్...

**ఆసిఫాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

అదిలాబాద్ జిల్లా లోని ఉట్నూర్ మండల కేంద్రంలో ఆదివాసి భవనంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తుడుం దెబ్బ మహాసభ నిర్వహించడం జరిగింది. తుడుం దెబ్బ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో కొమురం భీం జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ కొమురం భీం జిల్లా అధ్యక్షులు కొవ విజయ్ మాట్లాడుతూ ఆదివాసి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి మ హక్కులు సాదించుకుంటామని, అదేవిధంగా 1/70 చట్టం, పీసా చట్టం పకడ్బందీగా అమలు చేయాలని 5వ షెడ్యూల్లో మా ఆదివాసి ప్రజల భూములను గిరిజన నేతరులు కబ్జాలు చేసి తీసుకోవడం జరిగింది. ఆ భూములు మళ్ళీ మా ఆదివాసి ప్రజలకు తిరిగి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 29 శాఖలో ఉన్నటువంటి అధికారులు ఆదివాసి చట్టాలను గౌరవించి. ఆదివాసీ ప్రజల కోసం నిరంతరం కృషి చేయాలని వారు కోరారు. జైనూర్ మండలానికి చెందిన మెస్రం నిలబాయికి జరిగిన సంఘటనపై సిఎం రేవంత్ రెడ్డి స్పందించాలని, ఆదివాసీ ప్రజలపైన ఎందుకు ఇంత చిన్న చూపు అని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు, మహిళలు, యువకులు, ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం కొమురం భీం జిల్లా అధ్యక్షులు డబ్బ బాపు, ఆదివాసీ కొలవార్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## బహుమతులు తిరస్కరించిన గ్రామస్తులు



**దిలావర్పూర్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఇతనల్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నటువంటి పీఎంకే సంస్థ ఆధ్వర్యంలో బన్సపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లను పంపని చేయడంతో ఆగ్రహిం చినటువంటి గ్రామ యువకులువాటిని బహిష్కరిస్తున్నామని, వారి వస్తువులను వారికి తిరిగి ఇస్తామని ప్రకటించారు. ఇందులో పాల్గొంటున్న యువకులు మాట్లా డుతూ మా మండలాన్ని ముంచడానికి ఇతనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నటువంటి పీఎంకే సంస్థ చేసే దానధర్మాలు మా గ్రామానికి అవసరం లేవని అటువంటి దినస్థితిలో మా విద్యార్థులు లేరుఅని వారికి ఏమైనా అవసరం ఉంటే స్వచ్ఛందంగా యువకులందరం కలిసి సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని ఏదో మా గ్రామంలో వచ్చి డొనేషన్ల పేరుతో మజ్జిగ చేసుకునే ప్రయత్నం చేస్తు న్నారని వారి కుట్రలను ఎట్టి పరిస్థితిలో సహించే ప్రసక్తే లేదని ఇక మీదట దిలావ ర్పూర్, గుండంపెల్లి లతోపాటు తాము కూడా ఆందోళన కార్యక్రమాల ను చురుగ్గా పాల్గొంటామన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు పోల విక్రం, మేకల నరేష్, సాయినాథ్ గడ్డం సాయన్న రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజుల హక్కుల కోసం పోరాడుదాం

**ఆసిఫాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

ముదిరాజుల హక్కుల కోసం పోరాడు దామని తెలంగాణ ముదిరాజ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీ పేర్కొన్నారు. గురు వారం జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు పెద్దమ్మ తల్లికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని పేర్కొన్నారు. బీసీ-డీలో ఉన్న తమను బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సతీష్, రవి, రాజేష్, నరేష్, బాలేష్, సాయిరాం, శంకర్, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు బ్లాకుల వేలం.. పాటను రద్దు చేయాలి




**మంచిర్యాల, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాటను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. వేలం పాటలను రద్దు చేయాలని గురువారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సంతకాల సేకరణ చేప ట్టారు. ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. పని చేస్తున్న కార్మికులను బలవంతంగా ఇండ్లకు పంపించే కుట్రలో భాగంగా బొగ్గు బ్లాకులకు వేలం పాటలు నిర్వహిస్తోందన్నారు. వేలం పాటలను రద్దు చేసి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రేమ్కుమార్, రాజ్కుమార్, మోహన్ పాల్గొన్నారు. కాసిపేటలో బొగ్గు బ్లాకుల వేలం పాటలను రద్దు చేయా లని సీపీఎం నాయకులు సోమగూడెం చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీకి ఆటో యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల వేలం పాటలను నిరసిస్తూ 18 నుంచి సంతకాల సేకరణ చేపడుతున్నామని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందులో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాలు

**కౌటాల, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బోదంపల్లిగ్రామంలో గురువారం ముదిరాజ్ దశాబ్దిఉత్సవా లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ముదిరాజుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని పేర్కొన్నారు. బీసీ-డీలో ఉన్న ముదిరాజ్లను బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజులు అన్ని విధాల వెనకబడి ఉన్నారని వారి సంక్షే మం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సంఘం మండలాధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన భీమ్ ఆర్మీ నాయకులు



**ఇంద్రవెల్లి, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 26న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను భీం ఆర్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు షకీల్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను భీమ్ ఆర్మీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, కోశాధికారి సింగారే కిరణ్, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో.. ఆదివాసీలకు అన్యాయం

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**

అదిలాబాద్ జిల్లాలో గత కొంత కాలంగా జైనద్, అదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను గత ప్రభుత్వం ఆదివాసుల కోసమని రిజ ర్వేషన్ లను తీసుకొచ్చిన కొందరు రాజకీయ నేతలు ఆదివాసులకు మాత్రం అన్యాయం చేస్తున్నారని ఆది లాబాద్ జిల్లా, రూరల్, నాయకులు ఆరోపిస్తున్నారు. గు రువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి లు తమ హక్కులను కాలా రస్తున్నారని మండిపడ్డారు. గతంలో బి ఆర్ ఎస్ ఎంఎల్ఎ జోగు వారి స్వార్థ రాజకీయాల కోసం ఆ రిజర్వేషన్ లను ఆదివాసులకు ఇవ్వ కుండా కాలయా పన చేశారని అన్నారు. అ రిజర్వేషన్ లను ఆదివాసీ నాయకులు పొరటాలు చేసి సాధించుకున్నవి అని గుర్తు చేశారు. ఇవాళ్ళ జైనద్, అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ లను జైనద్ మండలానికి చెందిన వారికి ఇస్తున్నారని, ఇందులో ఆదివాసులకు మండి చేయి చూపారని మండి పడ్డారు. అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు జైనాద్ మండలానికి చెందిన వ్యక్తికి అప్పజెప్పడం దేనికి నిదర్శనమో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.





# బోథ్ ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

## సాయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం - మృతుల కుటుంబాలకు పరామర్శ - ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్న అనిల్ జాదవ్

**బోథ్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని పొన్న గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఇంగోలే భీంరావ్ పాటిల్ గతం నెల రోజుల కింద ఇటీవల మృతి చెందిన విషయం తెలుసు కున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పెంటన్న, ఏక్నాల్, చందు, రోహిదాస్, సూర్యకాంత్, మాజీ ఎంపీటీసీ సూర్యకాంతం, కృష్ణరెడ్డి కార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు.

**సాయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం...**
సిరికొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా నాఫెడ్ వారిచే తెలంగాణ రాష్ట్ర మార్కుఫెడ్ వారి ఆధ్వర్యంలో సాయా కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. అనంతరం మండలం లోని ఆయా గ్రామాలకు చెందిన 7 లబ్ధిదారులకు రూ. 1,26,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం గ్రామానికి చెందిన గాయక్వాడ్ బాలాజీ ఇటీవల మృతి చెందిన సూర వెంకటస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కైలాష్, చైర్మన్ గోరబడ్ ప్రకాష్, మండల నాయకులు పెంటన్న, ఏక్నాల్, చందు, రోహిదాస్, సూర్యకాంత్, మాజీ ఎంపీటీసీ సూర్యకాంతం, కృష్ణ రెడ్డి, మల్లేష్, రాజన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెజ్జూర్ మండలంలో..
# మత్స్యకారుల దినోత్సవం

**బెజ్జూరు, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
మండలంలోని హేటిగూడ గ్రామంలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ముదిరాజ్ మండలాధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అంశానికి చర్యలు చేపట్టి కులగణన సంపూర్ణంగా పూర్తిచేసి బీసీలకు రిజర్వేషన్లు జనాభా ప్రాతిపాదికన పెంచాలని డిమాండ్ చేశారు. రిజర్వేష న్లలో ముదిరాజ్‌లకు జనాభాకు తగ్గట్టు వాటా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహేష్, సన్యాసి, మహేష్, అశోక్, లింగయ్య, అంజయ్య, శ్రీశైలం, శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తుల పరిరక్షణలో
# అప్రమత్తంగా ఉండాలి

**తాండూర్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూ రిటీ విభాగం సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కార్పొరేట్ సెక్యూరిటీ జిఎం సిహెచ్ లక్ష్మి నారాయణ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలో గురువారం ఆయన పర్యటించారు. మొదటిసారిగా ఏరియాకు వచ్చిన ఆయనను బెల్లంపల్లి ఏరియా జిఎం ఎం.శ్రీనివాస్ సన్మానించారు. మూతబడిన ఎంవికె త్రీ, దోర్లి1, దో2 గనులు, ఏరియా వర్క్ షాప్, ఏరియా స్టోర్, కైరిగూడ ఓసిని సందర్శించారు. సిసి కెమెరాల పనితీరు, ఏరియా స్టోర్ వద్ద స్క్రాప్ డంప్ యార్డు ను పరిశీలించారు. విధి నిర్వహణలో సెక్యూరిటీ సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఏరియాలో సెక్యూరిటీ పై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువుల కబ్జా..
- హైడ్రా తరహా జిల్లాలోనూ ఉక్కు పాదం మోపాలి
- గత ప్రభుత్వ పాలనలో చెరువులు, భూముల కబ్జా
- నిర్మల్, మంచిర్యాల జిల్లాలో చెరువులు మాయం
- కబ్జా చేసిన చెరువుల్లో లే అవుట్‌ల ఏర్పాటు
- భూ కబ్జాలపై రాజకీయ ఘర్షణలు..
- హైడ్రా ప్రకంపనలతో అందరి దృష్టి నిర్మల్‌పైనే
- చెరువులు, కుంటల ఆక్రమణదారుల్లో టెన్షన్
- ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు
- సహకరించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో మొదలైన చర్చ
- స్థానికుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్ కూల్చివేతలపై సర్వత్రా ఆసక్తి

# హైడ్రా.. అటెన్షన్



(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)
ఆపరేషన్ హైడ్రా..!.. ఇప్పుడు ప్రతి ఒక్కరి నోట్లో నానుతున్న మాట. హైదరాబాద్ జంట నగరాల్లో చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న అనేక భవనాల సముదాయాలను కూల్చివేస్తున్న పరిణామాలపై అంతటా ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా రేవంత్ సర్కారు అధికార రాజకీయ ఒత్తిళ్లను పక్కనపెట్టి హైడ్రా యంత్రాంగానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన నేపథ్యంలో భారీ మొత్తంలో నిర్మించిన అపార్ట్మెం ట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, ఇతర బహుళ అంతస్తుల



భవనాలను కూల్చివేస్తున్న ఘటనలు విస్తుగొలుపుతున్నాయి. అక్రమాలను ఇలా కూడా తొలగించవచ్చా..! అని గతంలో విన్నామే కానీ చూడలేదన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి యంత్రాంగమే మన వద్దకు వస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని సైతం వ్యక్త పరుస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో భారీగా చెరువుల కబ్జాలు..**
గత ప్రభుత్వాల పాలనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక చెరువులు పెద్ద మొత్తంలో కబ్జాలకు గురయ్యాయి. ముఖ్యంగా మున్సిపల్ కేంద్రాలుగా ఉన్న పలు పట్టణాల్లో చెరువుల కబ్జాలు భారీగా జరిగాయి. ఉమ్మడి జిల్లాకు కేంద్రంగా ఉన్న ఆదిలాబాద్ సహా కొత్త జిల్లాలుగా ఏర్పడిన నిర్మల్ మంచిర్యాల జిల్లా కేంద్రాల్లో ఉన్న అనేక చెరువులు కబ్జాలకు గురై కుచించుకుపోయాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న రాముని చెరువు భారీగా కబ్జాకు గురైంది. మరోవైపు పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీ ఏర్పడడానికి ముందు ఆ ప్రాంతంలో పెద్ద చెరువు ఉండేది ఇప్పుడు ఆ చెరువు ఆనవాళ్లు లేకుండా పోయాయి. దీన్నిబట్టి చెరువుల కబ్జాలు మంచిర్యాల పట్టణంలో ఏ స్థాయిలో జరిగాయో అర్థం అవుతుంది. అలాగే జన్నారం మండల కేంద్రంలోని ఓ చెరువు భారీగా ఆక్రమణలకు గురైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో ఉన్న ఖానాపూర్ చెరువు వద్ద ట్యాంక్ బండ్ నిర్మాణం పేరుతో అప్పటి అధికార పార్టీ నాయకులు కబ్జాలు పెట్టారు మరోవైపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మావల పరిధిలో ఉన్న భారీ తటాకంలోకి 200 ఫీట్ల మేర చొచ్చుకు వెళ్లి కబ్జా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఈ చెరువు ఎఫ్ టి ఎల్ లో అనేక నిర్మాణాలు కూడా జరిగాయి దీనిపై అనేక ఫిర్యాదులు వెళ్లినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఓ నేత అండదండలతో కబ్జాకోరులు భారీగా ఆక్రమణలు చేశారని ఈ ఆక్రమణల్లో సదరు నేతకు వాటా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

**నిర్మల్ జిల్లాలో మరీ ఎక్కువ..**
ఆపరేషన్ హైడ్రా చేస్తున్న అక్రమ కట్టడాల కూల్చివేత నేపథ్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో చెరువుల కబ్జాలు మరోసారి తెరపైకి వస్తున్నాయి. అలాంటి కార్యక్రమాన్ని చేపడితే నిర్మల్ జిల్లా కేంద్రంలో నిమ్మ నాయుడు కాలంనాటి గొలుసుకట్టు చెరువులకు పునరుజ్జీవం వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టణ నడిబొడ్డుతో పాటు పట్టణం చుట్టూ సుమారు 13 పెద్ద చెరువులు ఉన్నాయి ఈ చెరువులకు ఒకదానితో ఒక చెరువుకు లింక్ ఇస్తూ కాలువలు ఉండేవి. పట్టణం భారీగా విస్తరించిన నేపథ్యంలో అనేకమంది కబ్జాదారులు చెరువుల లింకు కాలువలను మూసివేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. వీటిపై అనేక బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం జరిగాయి.
ఆక్రమణలు, కబ్జాలతో ఈ చెరువు భూముల విస్తీర్ణం 50 శాతం పైగా కనుమరుగైందన్న అభిప్రాయాలు ఉన్నాయి. నీటిపారుదల శాఖ రెవెన్యూ రికార్డుల ప్రకారం బంగల్ పేట చెరువు 210.32 ఎకరాలు, ఖజానా చెరువు 98.22 ఎకరాలు, కొత్తచెరువు 33.11 ఎకరాలు, రామ్ సాగర్ చెరువు 37.23 ఎకరాలు, కురన్నపేట చెరువు 76.18 ఎకరాలు, సీతా సాగర్ గొల్లపేట చెరువు 48.11 ఎకరాలు, ఇబ్రహీం చెరువు 76.18 ఎకరాలు, కంచరోని చెరువు 74.19 ఎకరాలు, ధర్మసాగర్ చెరువు 65.10 ఎకరాలు, మోతీ తలాబ్ చెరువు 132.06 ఎకరాలు, చిన్న చెరువు మంజులాపూర్ 81.34 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారుల వద్ద ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కానీ కబ్జాల కారణంగా ఈ చెరువులు ఇప్పుడు సగం విస్తీర్ణం కూడా లేకుండా పోయాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో బహుళ అంతస్తుల భవనాలు పాఠశాలల సముదాయాలు వాణిజ్య భవనాలు నిర్మాణం జరిగిపోయాయి ఇలాంటి అక్ర మ నిర్మాణాలు తొలగించడం అంత సులువైన పని కాదు హైడ్రా లాంటి కఠినమైన నిబంధనలతో అధికారయంత్రాంగానికి చేతికి పని చెబితే మాత్రమే ఆక్రమణలు తొలగే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**హైడ్రా లాంటి బుల్డోజర్ రావాలి...**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణలను తొలగించాలంటే హైదరాబాద్ లో జరుగుతున్న ఆపరేషన్ హైడ్రా లాంటి బుల్డోజర్ తమ జిల్లాకు తీసుకురావాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్ మంచిర్యాల ఆదిలాబాద్ పట్టణాలతో పాటు కొన్ని మండల కేంద్రాల్లోనూ భారీగా చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. భవిష్యత్ తరాలకు బహుళ ప్రయోజనాలు అందించే చెరువుల పరిరక్షణ జరగాలంటే ఇలాంటి కఠిన చట్టాలతో కూడిన సంస్థలకు అధికారం ఇవ్వాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.



# రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులు నిర్వహించాలి










- శిక్షణను పూర్తి చేసుకున్న 254 మంది ఎస్సీటీపీసి సివిల్ కానిస్టేబుళ్ళు
- అధికారులు, కుటుంబసభ్యుల సమక్షంలో జరిగిన దీక్షాంత్ పరేడ్
- చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులను నిర్వర్తించాలి
- పోలీసు సేవలో ప్రతి ఒక్కరూ అంతర్భాగమే
- పోలీసు వ్యవస్థలో విజయం సాధించాలంటే కుటుంబసభ్యుల సహకారం తప్పనిసరి
- ముఖ్య అతిథులుగా హాజరై న కలెక్టర్, ఎస్పీ, రెండవ బెటాలియన్ కమాండెంట్
- ఆరు జిల్లాల నుంచి పాల్గొన్న కానిస్టేబుల్ కుటుంబసభ్యులు

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
నీతి నిజాయితీలతో పాటు రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ పోలీసులు విధులు నిర్వహించాలని పీఅండ్ఎల్ ఐజీ రమేష్ అన్నారు. ఉద్యోగ రీత్య ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. గురువారం స్థానిక పోలీసు శిక్షణ కేంద్రంలో 9 నెలల పాటు నిరంతరంగా కఠోర శ్రమతో కూడిన శిక్షణను పూర్తి చేసుకున్న 6 జిల్లాల 254 స్టైఫండరి ట్రైనీ సివిల్ కానిస్టేబుళ్ల పరేడ్ నిర్వహించారు. ఈ శిక్షణలో రాజన్న సిరిసిల్ల -35, సూర్యాపేట - 129, జగిత్యాల్ - 34, ములుగు - 16, సంగారెడ్డి -15,సైబరాబాద్ - 25 మంది ఉన్నారు. శిక్షణ సమయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు, జైనూర్ సంఘటన, దేవీ నవరాత్రి ఉత్సవాల బందోబస్తు నిర్వహించారు. కాగా ఈ పరేడ్ లో ముఖ్య అతిథిగా తెలంగాణ పీఅండ్ఎల్ ఐజీ రమేష్ తో పాటు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, రెండవ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, శిక్షణ ఐఏఎస్ అభిజ్ఞన్, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, కానిస్టేబుల్ ల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ ప్రతి ఒక్కరూ విధులను నిర్వర్తించాలని సూచించారు. తాను కూడా ఒకప్పటి ఆదిలాబాద్ జిల్లాలో శిక్షణను తీసుకున్నట్లు గుర్తు చేశారు. పోలీసు ఉద్యోగంలో క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమైన విషయమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం శిక్షణను తీసుకున్న కానిస్టేబుళ్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు సిబ్బందికి ఇండోర్, అవుట్డోర్, బెస్ట్ ఆల్రౌండర్, పరేడ్ కమాండర్ విభాగాలలో బహుమతులు ప్రదానం చేశారు. అదే విధంగా శిక్షణను అందించిన 50 మంది పోలీసు సిబ్బందికి, వైద్య సిబ్బంది, న్యాయసహాయం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ సి.సమయ్ జాన్ రావు, అదనపు ఎస్పీ (ఆపరేషన్) బి.సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, బి.సురేందర్ రెడ్డి, ప్రకాష్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ సాధన సర్వేలో
# జిల్లాను అగ్రభాగాన నిలపాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
జాతీయ సాధనసర్వేలో జిల్లాను అగ్రభాగాన నిలపాలని జిల్లా అకడమిక్మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం గుండి జిల్లాపరిషత్ సెకండరీపాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మాట్లా డుతూ డిసెంబరు 4న జాతీయసాధన సర్వే3,6,9వ తర గతులకు ఉంటుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థు లకు ప్రత్యేకతరగతులు నిర్వహిస్తూ కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అభ్యసన ప్రదీపికలను సమర్థవంతంగా వినియోగించుకొని అన్ని అభ్యసన సామర్థ్యాలు, ఓఎంఆర్ పత్రాలమీద విద్యార్థు లకు పూర్తి అవగాహనను పెంపొందించాలన్నారు. అలాగే పదవతరగతి ఇద్యార్థులకు సెలబస్ సకాలంలో పూర్తిచేయాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం కౌటాల మండలంలోని మొగడ్దగడ్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో హనుమంతు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 91 మంది విద్యార్థులకు 88మంది విద్యార్థులు హాజరుకావడంతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను అభినందించారు. మెనూప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వతరగతి విద్యార్థుల ఎన్ఏఎస్ (జాతీయ సాధన సర్వే) సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే నజరత్ మిషన్, భారతి విద్యామందిర్ పాఠశాలలను సందర్శించారు. ఎన్ఏఎస్పై విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆయన అన్నారు.

## పట్ట పగలే దొంగతనం

**పెంబి, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
పాకాల రాజవ్వ ఇంట్లో పట్టపగలే దొంగతనం వివరాల్లోకి వెళితే పెంబి మండల కేంద్రంలో గురువారం రోజున పాకాల రాజవ్వ ప్రతిరోజు లాగానే ఉదయం 10 గంటలకి పొలం పనికి వెళ్లి తిరిగి ఇంటికి సాయంత్రం నాలుగున్నర గంటలకు వచ్చి చూడగా తన ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, బీరువాలు దాచుకున్న తులం కుత్తికట్టు, తులం పడిగెలు దొంగిలించినట్టు తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమో దు చేసుకొని జిల్లా క్లోజ్ టీం సహాయంతో నేర స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా అనుమానం కలిగేలా కొత్త వ్యక్తులు వచ్చిన పాత సామాన్లు ప్లాస్టిక్, చందర్లు మరి యు వెంట్రుకలు అమ్ముతామని వచ్చినట్లు తెలిసిన వెంటనే పోలీస్ లకు సమాచారం ఇవ్వాలన్నారు.

## కార్తీక మాస దీపోత్సవం

**బాసర, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని గురువారం రాత్రి ఆలయ వైదిక బృందంచే దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది.

## టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశానికి సుగుణ

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం గురువారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో జరిగింది. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ ఇన్ ఛార్జ్ ఆత్రం సుగుణక్క హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలు, తదితర విషయాలపై చర్చ జరిగినట్లు సుగుణక్క పేర్కొన్నారు.

## ప్రమాదంలో రైతుకు గాయాలు..

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తాంసి మండలం వడ్డాడి గ్రామానికి చెందిన పవార్ ప్రవీణ్ అనే రైతు గాయపడ్డారు. పత్తి పంట విక్రయించడానికి వచ్చిన ఆయన కాలుపై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్ళటంతో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది దీపక్, ఎండీ వసీం ప్రథమ చికిత్స చేసి స్థానిక రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

## మాలల సింహా గర్జన పోస్టర్ల విడుదల

**కుంటాల, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్లో నిర్వహించనున్న మాలల సింహా గర్జన సభను మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మాలలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కుంటాల మండలం ఓలా గ్రామంలో సింహా గర్జన పోస్టర్ విడుదల చేసి ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్ కోరారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పత్తి పంటలు పరిశీలించిన అధికారులు

**బోథ్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
తలమడుగుకు చెందిన రావుల మోహన్ రెడ్డి ఒక ఎకరం పత్తి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, విస్తరణ అధికారి స్ఫూర్తితో కలిసి గురువారం ధ్వంసమైన పత్తి పంటను పరిశీలించారు. ప్రమోద్రెడ్డి మాట్లా డుతూ.. రైతులు అడవి పందుల దాడి నుంచి పంటలను రక్షించుకోవడానికి సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రభాత సమాచారం
MOVIE TIME
శుక్రవారం | 22 నవంబర్ | 2024

# రెడ్ కార్పెట్ పై చైతూ-శోభిత



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోవాలోని పనాజీ వేదికగా 55వ భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకల్లో అగ్ర తారలు సందడి చేస్తున్నారు. టాలీవుడ్ స్టార్ నటుడు అక్కినేని నాగార్జున ఫ్యామిలీ ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా కాబోయే జంట నాగచైతన్య-శోభిత ఈ సినీ పండుగలో సందడి చేశారు. రెడ్‌కార్పెట్‌పై ఇద్దరూ ఫొటోలకు ఫోజులిస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఏడాది జరుగుతున్న ఇఫీ తెలుగు వారందరికీ ఎంతో ప్రత్యేకం. 8 రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేసిన నలుగురు ప్రముఖుల శత జయంతి వేడుకల సందర్భంగా వారికి నివాళులర్పించనున్నారు. అక్కినేని నాగేశ్వరరావు, రాజ్‌కపూర్, మధుర గాయకుడు మహమ్మద్ రఫీ, బెంగాలీ దర్శకుడు తపన్‌సిన్హాకు నివాళులర్పిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



# రాపో-22 లాంచ్

టాలీవుడ్ యాక్టర్ రామ్ పోతినేని కాంపౌండ్ నుంచి వస్తున్న తాజా చిత్రం రాపో-22. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు డైరెక్ట్ చేస్తున్నాడు. సినిమా నుంచి ప్రీ లుక్‌తోపాటు మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సేను టీంలోకి స్వాగతం పలుకుతూ అప్‌డేట్స్ అందించిన విషయం తెలిసిందే. మేకర్స్ తాజాగా ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని కెమెరా స్విఛాన్ చేయగా.. హను రాఘవపూడి క్లాప్ కొట్టాడు. తొలి సన్నివేశానికి వెంకీ కుడుములు గౌరవ దర్శకత్వం వహించాడు. త్వరలో షూటింగ్ షురూ కాబోతుందని తెలియజేశారు. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాన్ని టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.



# 24న కిసిక్ సాంగ్

ప్రస్తుతం టాక్ ఆఫ్ ది నేషన్ మూవీ పుష్ప-2. దర్శకుడు సుకుమార్ డైరెక్ట్ చేస్తుండగా అల్లు అర్జున్ మరోసారి బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ట్రైలర్ కట్ తో కూడా మూవీ కోసం నేషన్‌వైడ్‌గా అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. స్పెషల్ ఐటెం సాంగ్‌లో యంగ్ బ్యూటీ శ్రీలీల డ్యాన్స్ చేస్తుండటంతో ఈ పాట కోసం ప్రేక్షకులు ఎంతో ఆతృతగా చూస్తున్నారు. అయితే, ఈ సాంగ్‌ని మేకర్స్ ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తారా అని అందరూ ఎదురుచూస్తున్నారు. 'కిసిక్' అనే ఈ స్పెషల్ సాంగ్‌ను నవంబర్ 24న సాయంత్రం 7.02 గంటలకు రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యినట్లు తాజాగా ఓ స్పెషల్ పోస్టర్ ద్వారా అనౌన్స్ చేశారు. ఈ పోస్టర్‌లో బన్నీ కాలిపై బెండ్ అవుతూ శ్రీలీల పెట్టిన పోజు అదిరిందని అభిమానులు అంటున్నారు. ఇక దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటకు అందించిన ట్యూన్ డ్యాన్స్ ఫ్లోర్‌లపై నిప్పులు పుట్టించడం ఖాయమని చిత్ర యూనిట్ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు. ఈ పాట అనౌన్స్‌మెంట్‌తో అభిమానుల్లో పుష్ప-2 పై ఆసక్తి రెట్టింపు అయ్యింది. ఇక ఈ చిత్రాన్ని వరల్డ్‌వైడ్‌గా డిసెంబర్ 5న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది.



# 28న రోటి కపడా రొమాన్స్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, ప్రేమ ఇష్క్ కాదల్, పాగల్' వంటి యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించారు. ఈ చిత్రాన్ని నవంబర్ 22న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి రెడీ అయినా.. అనుకోని కారణాలతో ఈ నెల 28న పోస్ట్ పోన్ చేశారు.

ప్రభాత సమాచారం Digital Edition
తెలంగాణ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్ ఉమ్మడి
జిల్లా వార్తలు


# అన్ని వర్గాల అభ్యున్నతికి సర్కారు కృషి

- ధూం..ధాంగా సాగిన కళా ప్రదర్శనలు
- ప్రతిబింబించిన తెలంగాణ సంస్కృతి
- విజయోత్సవ సంబురాల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరించిన కళాకారులు
- నిర్మల్ జిల్లాలో ఘనంగా ప్రజాపాలన సంబురాలు
- ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ సమర్థవంతంగా పథకాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సంబురాలు పట్టణంలోని దివ్య గార్డెన్స్ లో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఆహ్లాదకర వాతావరణంలో సాగిన కళాయాత్ర ప్రదర్శనలో అంతడుపుల నాగరాజు బృందం ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటుతూ, ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరింజేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్, గ్రంథాలయ, మార్కెట్ కమిటీల చైర్మన్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఎంతో ఆసక్తి తో కళాకారుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు పరుస్తుందని తెలియజేస్తూ జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ వివరించారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించిన కళాకారుల బృందాలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఇన్చార్జి డిఆర్ఓ రత్న కళ్యాణి, డీపీఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ సయ్యద్ అర్జుమన్ అలి, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు గండ్రత్ ఈశ్వర్, రాజుర సత్యం లు, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, విద్యార్థులు, మహిళా సంఘాలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే పాల్వాయి



**కాగజ్‌నగర్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## పీఎం జన్ మన్ పథకంతో ఆదివాసీలు అభివృద్ధి

### ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్



**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
దేశ వ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్ మన్ యోజన) పథకం ప్రవేశ పెట్టిందని, దీని ద్వారా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలైన పొతూగూడ, మొలల గుట్టలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం జన్ మన్ యోజన పథకం ఆదివాసీ, గిరిజన గ్రామాలకు వరంగా అభివర్ణించారు. ఈ పథకం ప్రవేశ పెట్టిన మోడీకి మనమందరం రుణ పడి ఉన్నామని తెలిపారు.

ఈ పథకం ద్వారా మరో ఐదేళ్లలో గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో నెట్ వర్క్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చా రు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు ఎంతో మంది ప్రధాన మం త్రులు పనిచేశారని, ఏ ఒక్కపార్టీ గిరిజనులు, వారి సంక్షేమం కోసం పాటుపడలేదన్నారు. పార్టీలకతీతంగా జిల్లాలోని మారు మూల గిరిజన గ్రామాలను ఎంపిక చేసి, ఆ గ్రామంలో మంచి నీటి వసతి, రోడ్డు సౌకర్యం, విద్య, వైద్య ఆరోగ్య స్థితులను మెరుగుపరచడమే ధ్యేయంగా నేరుగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంతోష్, దయాకర్, సుభాష్, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా...

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి డిసెంబర్ నాటికి సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి చేయాలని, జనవరి నుండి రివిజన్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మొదటి సంగ్రహణాత్మక ఫలితాల ఆధారంగా విద్యార్థుల ఏ, బీ, సీ వర్గీకరణ చేసి, సీ-గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక బోధన ద్వారా వారి ప్రతిభను మెరుగుపరిచి పదవ తరగతి పాస్ అయ్యేలా చూడాలని కోరారు. అనేక కారణాల వలన తరుచూ పిల్లలు గైర్హాజర్ అయి చదువుకు దూరం అవుతున్నారని, పిల్లలందరినీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు అడప్షన్ చేసుకొని వారి ప్రతిభను, హాజరును పెంపొందిస్తే వంద శాతం రిజల్ట్ ను తీసుకు రావచ్చని అన్నారు. గత సంవత్సరం వార్షిక ఫలితాలలో తక్కువ ఫలి తాలు వచ్చిన పాఠశాలల్లో ఎక్కువ దృష్టి సారించి, మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఇంటర్మీడియట్ లో జనవరి, ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని, హాజరు శాతాన్ని పెంచడానికి విద్యార్థులను అడాప్షన్ చేసుకోవాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా వారికి బోధన చేసి, పూర్తి బాధ్యత వహించి విద్యార్థులను మెరుగు పరచాలని సూచించారు. హాస్టల్ వెల్ఫేర్, ఎంజేపీ, మైనారిటీ, సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థులపై శ్రద్ధ వహించి వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. టెన్త్, ఇంటర్‌ఫలితాల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కోరారు.



## రాష్ట్రంలోనే టాప్ సిర్పూర్(యు)లో 9.9డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

**ఆసిఫాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని ఏజెన్సీలో చలితీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. సిర్పూర్ (యు) మండలంలో గురువారం రాష్ట్రంలోనే కనిష్టంగా 9.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణి మండలంలో 11.2డిగ్రీలు, వాంకిడిలో 12.2డిగ్రీలు, కెరమెరిలో 12.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఏజెన్సీ మండలాలు చలికి వణికిపోతుండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో ఆయా గ్రామాల్లో చలి మంటలు కాగుతూ ప్రజలుచలినుంచి ఉపశమనం పొందుతున్నారు.

## ఈ నెల 29న తెలంగాణ వ్యాప్తంగా దీక్షా దివస్

**ఆదిలాబాద్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 29న తెలంగాణలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షా దివస్ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. తాను కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్‌లో పాల్గొంటానని వెల్లడించారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివస్ నిలుస్తుందన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందన్నారు. ఈ దీక్షా యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందన్నారు.



తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటించేలా చేసిందన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందన్నారు.

## మండల స్థాయి చెకుముకి విజ్ఞాన పరీక్ష

**ముథోల్, నవంబర్ 21 (ప్రభాత సమాచారం)**
ముథోల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి చెకుముకి విజ్ఞాన పరీక్ష నిర్వహించారు. విజ్ఞాన పరీక్షను మండల అభివృద్ధి అధికారి శివకుమార్ ప్రారంభించారు. మండల స్థాయి చెకుముకి విజ్ఞాన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 28న జిల్లా పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి చెకుముకి విజ్ఞాన పరీక్షలు గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు.

